# భం గురువాణి



24 సెప్టెంబర్, 2026

సంచిక-268

## ఈ ప్రపంచంలో మానవుని వెల ఎంత?

ఈ ప్రపంచంలో మానవుని యొక్క కర్తవ్యం ఏమిటి, మానవుని యొక్క ఉద్దేశం ఏమిటి, మానవుని యొక్క వెల ఎంత, మానవుని యొక్క గురి ఏమి? అనే ప్రశ్నలు మనకు అప్పుడప్పుడు ఉద్భవిస్తాయి.

ఈ జీవితంలో మానవుడు ఏమి చేస్తున్నాడు అంటే "కమానా, ఖానా, పీనా, సోనా" సంపాదించడం, తినడం, త్రాగటం, నిద్రించటం. ఇదేనా మానవుని యొక్క కర్తవ్యం? పశుపక్షాదులు కూడా పొట్టకూటి కోసం సంపాదిస్తున్నాయి, అవి కూడా తింటున్నాయి, త్రాగుతున్నాయి, పడుకుంటున్నాయి. మన బ్రతుకు కూడా ఇంతేనా, తినటం త్రాగటం నిద్రించటం? "బస్కే దుష్వార్ హై హర్ కామ్ కా ఆసాన్ హోనా" ఆద్మీ కో భి మయస్సర్ నహి ఇన్సాన్ హోనా ".

మనిషికి కూడా మానవునిగా బ్రతికే దానికి అంత సులభం కాదు అని అంటారు పెద్దలు. 'మా' అంటే అజ్ఞానం 'న' అంటే లేకుండా 'వ' అంటే వర్తించు వాడు, అజ్ఞానం లేకుండా ఎవడైతే జీవిస్తాడో వాడే మానవుడు అనిపించుకోవడానికి హక్కు కలిగినటువంటివాడు.

ఒకసారి ఒక రాజ దర్బారులో ఈ ప్రపంచంలో మనిషికి ఉన్న విలువ ఎంత అనే చర్చ వస్తుంది. అప్పుడు రాజుగారు సైనికుణ్ణి పిలిచి నీవు వెళ్లి ఒక మేక తల, ఒక సింహం తల, ఏనుగు తల, అలాగే ఒక మనిషి తల తీసుకుని రమ్మని ఆజ్ఞాపిస్తాడు. ఆ సైనికుడు రాజుగారు చెప్పినట్లుగానే అన్ని రకాల తలలను తీసుకొని వస్తాడు. అప్పుడు రాజుగారు ఆ సైనికుని తో ఈ తలలను తీసుకుని వెళ్లి బజారులో అమ్ముకొని రమ్మని ఆజ్ఞాపిస్తాడు. ఆ సైనికుడు రాజు గారి ఆజ్ఞను పాటించి అమ్ముకుని రావడానికి వెళతాడు. అన్ని జంతువుల తలలు అమ్ముడు పోతాయి కానీ మనిషి తల మాత్రం అమ్ముడుపోదు. సైనికుడు తిరిగి వచ్చి రాజా అన్ని జంతువుల తలలు అమ్ముడుపోయాయి కానీ మనిషి తల మాత్రం అమ్ముడుపోలేదు. ఎవరు కూడా మనిషి తల కొనడానికి ముందుకు రావడం లేదు అని అంటాడు.

అప్పుడు రాజుగారు సభను ఉద్దేశించి మాట్లాడుతూ మేధావులారా, పండితులారా, మంత్రులారా, ప్రజలారా చూడండి ఇది మనిషి యొక్క విలువ అని వివరిస్తాడు. కాబట్టి శిష్య భక్తాదులరా సమాజంలో మానవునిగా బ్రతికినప్పుడు మాత్రమే మనిషికి ఎంతోకొంత విలువ ఉంటుంది. మీరందరూ దీనిని గుర్తుపెట్టుకుని నీతి కలిగిన మానవులుగా బ్రతకగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.